
అరటి శీతల గిడ్డంగిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

లక్ష్యానికి అనుగుణంగా వినియోగంలోకి తీసుకురావాలి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

పులివెందుల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అరటిశీతల గిడ్డంగిని లక్ష్యానికి అనుగుణంగా వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం పులివెందుల పరిధిలోని బ్రాహ్మణపల్లె సమీపంలో నిర్మించిన అరటి శీతల గిడ్డంగిని ఆయన పరిశీలించారు. అనంతరం అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను, గిడ్డంగి కెపాసిటీ, మిషనరీ, ప్రాసెసింగ్ యూనిట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ లక్ష్యంతో నిర్మించారు.. పూర్తయి ఎన్ని రోజులు అయింది.. ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదు అని అధికారులను అడిగారు. ఇక్కడ అరటి సాగు ఎంత విస్తీర్ణంలో ఉంటుంది. అందుకు తగ్గ సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయా అని ఆరాతీశారు. సమస్యలను అధిగమించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్ ఏడీ ఆజాద్, పులివెందుల ఆర్డీఓ గనేష్ట భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, వైసీపీ నేత బలరామిరెడ్డి పాల్గొన్నారు.

అన్నిరకాల భద్రతా ప్రమాణాలతో నిర్మాణ పనులు

● ఎయిర్‌పోర్టు సిబ్బందికి కలెక్టర్ ఆదేశాలు

కడప కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిబంధనలకు లోబడి ఎయిర్‌పోర్టు నూతన భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు అన్నిభద్రతా చర్యలు పాటించాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను, ఏజెన్సీలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పౌరవిమానయాన సేవారంగంలో ప్రయాణికుల అనుభవాలు, సౌకర్యాలు దృష్టిలో ఉంచుకుని ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా టర్మినల్ భవనాల నిర్మాణాలను చేపట్టాలన్నారు. ప్రతివారం కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలన్నారు. ఎయిర్‌పోర్ట్ పరిసరాలను అనధికారిక చర్యలు, భద్రతకు భంగం వాటిల్లే సంఘటనలు, నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. టర్మినల్ భవనానికి అవసరమైన కంకర, ఇసుక, గ్రావెల్ తదితర మెటీరియల్‌ను అందుబాటులోని రీచ్‌లు, మైన్స్ నుంచి తీసుకునేలా ప్రత్యేక అనుమతులకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. టర్మినల్ భవనాల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున, జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహాయ సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్, విమానాశ్రయం డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్, ప్రాజెక్టు ఇన్‌చార్జి రాజేష్‌కన్నా, కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీలు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాల్గవ రోజూ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ


పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు

కడపస్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ బుధవారం యథాతథంగా సాగింది. నగర డీఎస్‌ఏ మైదానంలో జరగాల్సిన ఈ ర్యాలీ తుఫాన్ ప్రభావం కారణంగా వర్షం పడడంతో ర్యాలీకి అంతరాయం ఏర్పడింది. వర్షం రాకతో ఆ మైదానం కాసింత చిత్తడిగా మారింది. దీంతో అభ్యర్థులకు నిర్వహించే పరుగుపోటీని మహావీర్ సర్కిల్ నుంచి ప్రారంభించారు. పరుగు పందెంలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇతర పోటీలను యథాతథంగా డీఎస్‌ఏ మైదానంలో నిర్వహించారు. ఇదిలా వుండగా ఫిజికల్ టెస్ట్ పూర్తిచేయని వారికి తదుపరి రెండు, లేదా మూడు రోజుల తర్వాత హాజరయ్యేలా పిలుస్తున్నారు. ఏదేని రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, కందకంపై నుంచి దూకే సమయంలో గాయపడిన అభ్యర్థులకు మైదానంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్నారు. గత నాలుగు రోజులుగా సాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరవుతున్న అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత పోలీస్ శాఖ, స్థానిక అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

వర్రా రవీంద్రారెడ్డి వాంగ్మూలంతో.. ఎంపీ అవినాశ్ మెడకు

బిగుస్తున్న ఉచ్చు





● సభ్యసమాజం సిగ్గుపడేలా వైసీపీ సోషల్ మీడియా పోస్టులు

● వర్రా అరెస్టుతో సోషల్ మీడియా సైకోల్లో కలవరం

● భార్గవరెడ్డి కోసం లుకౌట్ జారీ ● మిగతా వారి కోసం పోలీసుల వేట

కడప, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ప్లాట్‌ఫాంను జగన్ అండ్ కో గబ్బు పట్టించింది. ఎలాగంటే రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎవరైనా తమ భావాలను, పార్టీ సిద్ధాంతాలు, విధి విధానాలను, అభిప్రాయాలను తెలియజేయవచ్చు. జగన్ ఆధ్వర్యంలో వైసీపీ సోషల్ మీడియాను బూతు మీడియాగా మార్చారనే ఆరోపణలు ఉన్నాయి. కరోనా తర్వాత జనం మొబైల్, ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయిపోయారు. ఈ రెండు రోజువారి జీవితంలో ఓ భాగమయ్యాయి. అయితే ఈ ప్లాట్‌ఫాంను కొందరు మంచికి వాడుకోగా, వైసీపీ మాత్రం చెడుకే వాడుకుంది. ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత ఇతర టీడీపీ నేతలు, ప్రముఖులపై వైసీపీ సోషల్ మీడియా పిచ్చికుక్కలా మొరిగింది. అన్నట్లుగానే సింహాద్రిపురం మండలానికి చెందిన హరి ఫిర్యాదు మేరకు మాల, మాదిగ అనే దూషణలతో పాటు సోషల్ మీడియాలో కమ్మకులానికి ఇతర కులానికి పెట్టిన పోస్టులు తీసేయాలని అడిగినందుకు 'నువ్వు ఎవడ్రా మాదిగనా కొడకా' అని, రూ.2లక్షలు ఇవ్వాలని బెదిరించారని హరి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో నీచాతి నీచమైన పోస్టులు పెడుతున్న వర్రా రవీంద్రరెడ్డిపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. పోలీసులు అతన్ని పట్టుకోవడంతో ఈ కేసులో జగన్ మేనళ్లుడు అర్జున్‌రెడ్డి, వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి పేర్లు బయటకువచ్చాయి. అయితే బూతు కంటెంట్ అంతా తాడేపల్లెలో తయారైతే దాన్ని ఇక్కడ సోషల్ మీడియాలో పోస్టులు చేసేవారు. ఈ పోస్టులు చూస్తే సభ్య సమాజం సిగ్గుపడేలా కంటెంట్ ఉంటుంది. అయితే ఇప్పుడు వర్రా రవీంద్రరెడ్డి అరెస్టుతో వైసీపీ సోషల్ మీడియా మూలాలు కదులుతున్నాయి.

వైసీపీ సోషల్ మీడియాతోనే బూతు కంటెంట్

2000 సంవత్సరం మునుపు వరకు తెలుగు సినిమాలో షకీల సినిమాలైన మలయాళం సినిమాలు ఉండేవి. షకీల సినిమాలు అంటేనే బూతు కంటెంట్. అయితే ఫస్ట్‌టైం సోషల్ మీడియాను బూతులకు ఉపయోగించింది అంటే జగన్ ఆధ్వర్యంలోని వైసీపీనే. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనితపై పోస్టులు పెట్టారు. అరెస్టు అయిన వేముల మండలంలోని కొండ్రెడ్డిపల్లెకు చెందిన వర్రా రవీంద్రరెడ్డిని విచారించారు. అయితే అతని వెనుక సోషల్ మీడియా కన్వీనర్ భార్గవరెడ్డి, జగన్ మేనల్లుడు అర్జున్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి పాత్ర ఉన్నట్లు చెప్పుకొచ్చారు. సోషల్ మీడియా సజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డి ఆదేశాల మేరకే పోస్టులు పెడుతున్నట్లు వెల్లడించారు. వర్రా రవీంద్రరెడ్డి 2012లో భారతి సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేస్తుండేవాడు. సజ్జల భార్గవరెడ్డి సోషల్ మీడియా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.

ఎంపీ అవినాశ్‌రెడ్డి మెడకు చుట్టుకున్న ఉచ్చు

సింహాద్రిపురం మండలానికి చెందిన హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో వర్రా రవీద్రరెడ్డి, సజ్జల భార్గవరెడ్డి పేర్లు ఉన్నాయి. అయితే ఒక కులాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. వీటిలో ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఆదేశాల మేరకే పోస్టులు పెట్టామన్నారు. దీంతో ఈ అసభ్య మెసేజ్‌ల వెనుక ఎంపీ అవినాష్‌రెడ్డి ఉన్నారనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. వర్రా రవీంద్రరెడ్డి జగన్ సోదరి వైఎస్ షర్మిల, వైఎస్ సునీత, విజయమ్మలపై అనుచిత పోస్టులు పెట్టారు. వీటిపై ఇప్పటికే షర్మిల, సునీతలు హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. వర్రా రవీంద్రరెడ్డిని అదుపులోకి తీసుకున్నప్పుడు షర్మిల గురించి విలేకరులు ప్రశ్నించగా ఆమె తెలంగాణలో ఫిర్యాదు చేసింది. ఆమె కేసులు ఇక్కడికి బదిలీ అయితే చర్య తీసుకుంటామని డీఐజీ ప్రవీణ్ చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత బుధవారం మధ్యాహ్నం పులివెందులకు చేరుకుంది. అయితే తనపై సోషల్ మీడియలో పెట్టిన కేసుల గురించి ఫిర్యాదు చేయనున్నారు.

ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. సింహాద్రిపురం మండలానికి చెందిన హరి ఫిర్యాదు మేరకు వర్రా రవీంద్రరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ బూతు కంటెంట్ అంతా అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఇచ్చినదే అని చెప్పుకొచ్చారు. వైఎస్ షర్మిలపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అయితే అన్ని వేళ్లు ఎంపీ అవినాష్‌రెడ్డి వైపే చూపిస్తున్నాయి. ఫిర్యాదు చేసేందుకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత బుధవారం మధ్యాహ్నం ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. సోషల్ మీడియాపై కేసు పెట్టేందుకు ఆమె పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ఇటు పోలీసుల విచారణలో తన వెనుక ఎవరున్నారో వర్రా రవీంద్రరెడ్డి వెల్లడించారు. రాఘవరెడ్డి దొరికితే ఈ కేసు అవినాష్‌రెడ్డి మెడకు చుట్టుకుంటుందని అంటున్నారు.



భార్గవరెడ్డి కోసం లుకౌట్ జారీ

సజ్జల భార్గవరెడ్డి వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి బూతులు బాగా పెరిగాయంటారు. ఆ బ్యాచ్‌లో పనిచేసే వారికి బిస్కెట్లు వేసి కుటుంబ సభ్యులే చూడని విధంగా బూతులను పోస్టులు చేసేశారు. ఇక పై నుంచి వచ్చే డైరెక్షన్‌లో వర్రా రవీంద్రరెడ్డి అతనికి ఒక ఫ్యామిలీ ఉందని మరచి ఘోరంగా పోస్టులు పెట్టేవారు. అందుకే భార్గవరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఇలా పలువురు బయటకు వచ్చారు. ఇక సోషల్ మీడియాలో అచ్చోసిన ఆంబోతులా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అప్పటి జగన్ ప్రభుత్వ హయాంలో లింగారెడ్డి రాజశేఖర్‌రెడ్డి జడ్జిలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారు. టీడీపీ ప్రభుత్వం రాకముందు కూడా నీచమైన భాష వాడేవారు. ఇతనిపై కూడా కేసు నమోదైంది. ఇతనితో పాటు కడప జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నిశాంత్‌రెడ్డి, మరికొందరి కోసం వేటలో ఉన్నారు. ఇక సింహాద్రిపురం మండలానికి చెందిన హరి ఫిర్యాదు మేరకు కేసునమోదైంది. అయితే ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో పోస్టులు చేసే వారి కోసం, అసలు సూత్రధారి అయిన సజ్జల భార్గవరెడ్డి, అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి కోసం పోలీసులు వేట సాగిస్తున్నారు. కాగా కడప సెంట్రల్ జైల్లో ఉన్న వైసీపీ సోషల్ మీడియా సైకో వర్రా రవీంద్రరెడ్డిని వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు కడప సర్వజన ఆసుపత్రికి బుధవారం సాయంత్రం తీసుకొచ్చారు.

పెద్దదర్గాలో సినీ నేపథ్య గాయకుడు మనో



కడప కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు నాగూర్‌బాబు (మనో) బుధవారం కడపలోని ప్రఖ్యాత పెద్ద దర్గాను దర్శించుకున్నారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలను పురష్కరించుకుని ముందస్తుగా ఆయన కడప చేరుకుని అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్నారు. దర్గా ప్రతినిధులు అమీర్ ఆయనకు స్వాగతం పలికారు. తదుపరి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు గావించి పూలచాదర్ సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమగల పెద్దదర్గాను దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. మనస్సుకు ప్రశాంతత చేకూరిందన్నారు. కార్యక్రమంలో మనో సతీమణితో పాటు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామికి క్షీరాభిషేకం

● పట్టువస్త్రాలు సమర్పించిన మహానంది ఈవో

బ్రహ్మంగారిమఠం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి మహోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారికి ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. కార్తీక శుద్ధ ద్వాదశి స్వామివారు అవతరించిన పవిత్ర రోజు కావడంతో ఆలయ ప్రాంగణంలో ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటలకు నిత్య పూజలు, హోమాలు, మధ్యాహ్నం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉన్న కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాలతో ఆలయ పురవీధుల గుండా భక్తి, శ్రద్ధలతో ఊరేగింపుగా వెళ్లి పార్కులో ప్రతిష్ఠగావించిన వీరబ్రహ్మేంద్రస్వామి శిలామూర్తికి పూర్వపు మఠాధిపతుల కుమారులు వెంకటాద్రిస్వామి, దత్తాత్రేయ స్వామి, కుటుంబ సభ్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం గావించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం

మహోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి 8 గంటలకు కన్నుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ సమేత కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆస్థాన పండితుల సమక్షంలో పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. కాగా మహానంది ఈవో శ్రీనివాసులరెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, ముత్యాలు సమర్పించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి కందిమల్లాయపల్లె పురప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈశ్వరయ్యాచారి, ఆస్థాన పండితులు, పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.


బ్రహ్మంగారి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న వెంకటాద్రిస్వామి


ఆలయ పురవీధుల గుండా కలశాలు తీసుకెళ్తున్న భక్తులు

రెండేళ్లయినా.. రోడ్డు విస్తరణ లేదు

● వైసీపీ హయాంలో రూ.25కోట్లు మంజూరు

● అస్తవ్యస్త ప్రణాళికలతో ఆగిన పనులు

● బిల్లులు అందినా పనుల పూర్తికి ముందుకు రాని కాంట్రాక్టర్లు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు


ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రోడ్లపైకి వస్తున్న మురుగు నీరు

పోరుమామిళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండేళ్ల క్రితం అప్పటి సీఎం జగన్ బద్వేలుకు వచ్చిన సందర్భంలో పోరుమామిళ్ల రూపురేఖలు మారుస్తానని, రోడ్డు విస్తరణ పనులు చేపడతామని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి రహదారుల రూపురేఖలే మారుస్తానని, రోడ్డుకిరువైపులా డ్రైనేజీ ప్లాట్‌ఫాం నిర్మించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. దీంతో పోరుమామిళ్ల ప్రజలు సంతోషించారు. ఈ మేరకు రూ.25 కోట్లు మంజూరు చేశారు. అప్పటి సీఎం హామీ ఇచ్చినా రోడ్డు విస్తరణ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కొంతవరకు పనులు చేసి బిల్లులు రాకపోవడంతో నిలిపివేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బిల్లులు ఇచ్చినా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. అధికారుల అలసత్వం కారణంగా పోరుమామిళ్ల ప్రజలే కాకుండా పోరుమామిళ్ల మీదుగా విజయవాడ, కడపకు ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెండేళ్ల క్రితం పోరుమామిళ్లలో దాదాపు 4 కి.మీ వరకు మొత్తం 80 అడుగుల వెడల్పుతో రూ.25 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టారు. మధ్యలో అవాంతరాలు ఏర్పడినా అధికారుల వత్తిళ్లకు తలొగ్గి అప్పులు చేసి కాంట్రాక్టర్లు పనులు చేశారు. కానీ బిల్లులు పడకపోవడం పెట్టుబడి భారం ఎక్కువ కావడంతో పనులు నిలిపివేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డుకిరువైపులా స్టేట్‌బ్యాంకు వరకు సింగిల్‌రోడ్డు వేసి డివైడర్లు ఏర్పాటు చేశారు. స్టేట్‌బ్యాంకు వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వెళ్లే రహదారిలో కొంత మేరకు సిమెంటు రోడ్లు వేశారు. అక్కడ నుంచి మధ్యలో బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని పనులను మధ్యలో ఆపేశారు. ఆర్టీసీ బస్టాండు నుంచి సాయిబాబా దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా సిమెంటు రోడ్డు వేసినా ఇంకా డ్రైనేజీ కాల్వలు నిర్మించి ప్లాట్‌ఫారం పనులు మిగిలిపోయియి. విద్యుత్‌శాఖకు సంబంధించి వారికి పోల్స్ తొలగించడానికి డబ్బు చెల్లించని కారణంగా విద్యుత్‌స్తంభాలు పట్టణంలో అలాగే ఉండిపోయాయి.

పనులు ఆగడంతో ట్రాఫిక్ సమస్య

ఎక్కువగా ఉదయం, సాయంత్రం పూట ప్రభుత్వ పాఠశాలల వాహనాలు ఎక్కువగా ఈ రహదారుల వెంట వచ్చి వెళుతుంటాయి. విజయవాడ, కర్నూలు, శ్రీశైలం వెళ్లే వాహనాలు ఈ దారి గుండానే పోతాయి. అంతేకాక వేలాది మంది విద్యార్థులు పోరుమామిళ్లకు వచ్చి పోతుంటారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తికాని కారణంగా ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. అంబేడ్కర్ సర్కిల్ నుంచి నరిసంగపల్లె దారి వరకు ఇరువైపులా కంకర పరిచి అలాగే వదిలేశారు. పోలీసుస్టేషన్ సమీపంలోని అటవీ కార్యాలయం నుంచి వేణుగోపాలస్వామి దేవాలయం వరకు రోడ్డుకిరువైపులా కంకరను తోలి వదిలేశారు. నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు రాళ్లు తగిలి చాలా మందికి గాయాలయ్యాయి. అంతేకాక వర్షాకాలంలో ఆర్టీసీ బస్టాండు, అబేడ్కర్ సర్కిల్, సాయిబాబా దేవాలయం వద్ద వర్షం నీరు నిలిచి కుంటలను తలపిస్తోంది. డ్రైనేజీ కాల్వలు పూర్తిగా పూడిపోయాయి. ఇప్పటికైనా పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ సలీంను, ఏఈ రెడ్డిగోవిందును వివరణ కోరగా పాత బిల్లులు పడిన విషయం వాస్తవమేనని తిరిగి పనులు ప్రారంభించాలని లెటరు పెట్టామన్నారు. త్వరగా పనులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.


సాయిబాబా దేవాలయం వద్ద ప్రారంభానికి నోచుకోని రోడ్డు విస్తరణ పనులు


ఓఎల్ఎఫ్ హైస్కూలు సమీపంలో కంకర పరిచి వదిలేసిన దృశ్యం

ఆ 11మంది ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయండి

● సబ్‌కలెక్టరేట్ ఎదుట జనసేన డిమాండ్



సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

మదనపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీకి రాని ఆ 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ అసెంబ్లీకి రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజలను అవమానించినట్లేనని, ప్రజాసమస్యలపై చర్చించడానికి అసెంబ్లీకి రాకపోవడంపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఆ వైసీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ మేరకు వీరిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కోరారు. ఎక్కడా లేని విధంగా రాజంపేట పార్లమెంటులో పుంగనూరు, తంబళ్లపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, అమర్నాథ్‌లు గెలిచినా..ప్రజల పక్షాన నిలవాల్సిన వీరంతా అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజలను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు అమర్ నారాయణ, తంబళ్లపల్లె జనసేన నాయకులు మల్లికార్జున, నరసింహులు, మదనపల్లె నియోజకవర్గ నాయకుడు సందీప్‌రెడ్డి, జగదీష్, చిరంజీవి, శంకర్, అప్సర్, మనోజ్, దేవేంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మార్పుతోనే వివక్షను పారదోలవచ్చు

● సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్

మదనపల్లెటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగి సమాజంలో మార్పు వచ్చినప్పుడే కుల వివక్షతను పారదోలవచ్చని తిరుపతి సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తిరుపతి సీఐడీ పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. సీఐడీ డీఎస్పీ మాట్లాడుతూ చదువుతో స్నేహాన్ని పెంచుకుంటే కుల, మతాలనే అంతరాలుండవన్నారు. పట్టణాలు, నగరాల్లో ఈ అంతరాలు చాలా తగ్గాయని, కేవలం గ్రామాల్లోనే అంటరానితనం అక్కడక్కడ చోటుచేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో 1997లో పుల్లయ్య కమిషన్ ఏర్పాటు చేశాక ఎస్సీ, ఎస్టీల మీద జరిగిన అరాచకాల పట్ల నివేదికలు అందించారని, ఆయన ప్రతిపాదించిన 18 అంశాలను హోంశాఖ ఆమోదించిదన్నారు. విద్యార్థి దశ నుంచే అందరూ సమానమన్న జాతీయభావన తీసుకురావాలన్నారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ కొందరికి ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన లేకపోవడంతో నేరాల్లో కూరుకుపోతున్నారన్నారు. బాధితులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై ఫిర్యాదు ఎలా చేయాలి, చట్ట ప్రకారం బాధితులకు అందే న్యాయం, సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం ఈ చట్టంపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు పలు అంశాలపై పరీక్ష నిర్వహించి ఉత్తమంగా రాసిన ఆరుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, సీఐడీ సీఐ కుళ్లాయప్ప, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి జయప్రకాష్, తహసీల్దార్ ఖాజాబీ, డీటీ కుమారి, ఏపీపీ వీరాంజనేయులు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.



బీటీ డిగ్రీ కళాశాలలో జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

మద్యం ముట్టరు.. మాంసం తినరు

పెద్దగొడుగు స్వామి ఆలయం



● గ్రామంలో పాదరక్షలు వేసుకోరు

● పల్లె ప్రజలందరిదీ ఒకేమాట.. ఒకే బాట

● ఆచారాలన్నీ తూచా తప్పకుండా పాటిస్తున్న పెద్దగొడుగు స్వామి భక్తులు



ఎగువమూలపల్లె గ్రామం వ్యూ

గాలివీడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అది ఒక కుగ్రామం. ఆచారాలకు, సంప్రదాయాలకు, కట్టుబాట్లకు నిలయం. ఆ గ్రామంలో 20 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వీరంతా మద్యం ముట్టరు, మాంసం తినరు. మంచం మీద కూర్చోరు. నల్లజీవాలను పోషించరు. ఆ పల్లె ప్రజలందరిదీ ఒకేమాట.. ఒకేబాట. ప్రాచీన సాంప్రదాయాలను, ఆచారాలను తూచా తప్పకుండా పాటిస్తూ జీవనం సాగిస్తున్నారు.

గాలివీడు మండల కేంద్రానికి 6 కి.మీ. దూరంలో ఉన్న తూముకుంట పంచాయతీ ఎగువమూలపల్లెలో ప్రాచీన కాలంలో కొన్ని యుగాల క్రితం నుంచి నోముల బ్రహ్మదేవుడిని పూజించడం ఆచారం. కానీ ఆ దేవుడి పూజారులకు (భత్తలయ్య) ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ఎక్కువ.

కట్టుబాట్లు కట్టుదిట్టం

నోములు బ్రహ్మదేవుడు (పెద్దగొడుగు) స్వామి భక్తులకు పల్లె ప్రజలకు ఆనాటి నుంచి నేటి వరకు కట్టుబాట్లు కట్టుదిట్టంగా పాటిస్తున్నారు. ఆ పల్లె ప్రజలు ఎవరూ చెప్పులు వేసుకుని గ్రామంలోకి వెళ్లరు. పల్లె శివారులో వదిలి వెళతారు. పూజారులు అయితే ఎప్పటికీ చెప్పులు వేసుకోరు. నులకమంచం మీద కూర్చోరు. కోళ్లను, నల్లజీవాలను పోషించరు. ఈత చాపల మీద కూడా నిద్రపోరు. మహిళలు బహిష్టు అయితే 5 రోజుల వరకు ఊరుబయట ఉండాల్సిందే. ఆడపిల్లలు మొదటిసారి అయినప్పుడు 12 రోజులు ఊరుబయట ఉండాల్సిందే. పల్లెలో ఎవరైనా చనిపోయినా కర్మకాండ పూర్తయ్యే వరకు వారి కుటుంబ సభ్యులు ఊరుబయట ఉంటారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే పెద్దగొడుగు స్వామి ఆలయ తలుపులను కూడా 12 రోజుల తర్వాత పురోహితులచే పూజలు చేసిన తర్వాతే తెరుస్తారు. ఇలా కట్టుదిట్టమైన సంప్రదాయాలకు కారణం భయం, భక్తిభావం.



ఊరిబయట వదిలిన చెప్పులు

ప్రాచీన కాలంలో భత్తులయ్య, భక్తలమ్మ అనే ఇరువురు స్వామి భక్తులు ఉండేవారు. భత్తులయ్య సమీపంలోని కొండలోకి తపస్సు కోసం వెళ్లగా ఆయన 7 మంది కుమారులు వివిధ రకాల వ్యాపారాలు కోళ్లు, మంచాలు, నల్లజీవాలు, ఈతాకుల వ్యాపారానికి వెళ్లారని, వీరికి కొన్ని గోవులు కూడా ఉండేవని గ్రామస్తులు తెలిపారు. భక్తలమ్మ పరమ పవిత్రత గల మహిళ అని, ఆమె బహిష్టు సమయంలో ఊరుబయట ఉండాల్సి వచ్చిందని, అలాంటి సమయాల్లో గోవులు (పశువులను) విప్పడానికి, భర్త భత్తులయ్యకు భోజనం వడ్డించడానికి ఎవ్వరూ లేకపోవడంతో గోవులు, భర్త ఆకలితో అలమటిస్తున్నప్పుడు ఆమె ఊరి కట్టుబాట్లను వదిలి గ్రామంలోకి వచ్చిందని తెలిపారు. అనంతరం గ్రామానికి అరిష్టం జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకపక్క భయంతో మరోపక్క భక్తితో గ్రామస్తులు ఉన్నట్లు ప్రజలు తెలిపారు.

కట్టుబాట్లకు కట్టుబడి ఉన్నాం

- పూజారి పెద్దమల్లయ్య



గ్రామస్తులందరూ కట్టుబాట్లకు కట్టుబడి ఉన్నారు. ఎవరూ ఈత చాప, మంచం మీద కూర్చోము, మాసం, మద్యాన్ని సేవించడం, చెప్పులు వేసుకొని తిరగం. మేము భక్తి శ్రద్ధలతో నోములు బ్రహ్మదేవుడు (పెద్దగొడుగు) స్వామిని కొలుస్తాము. ఇప్పటి వరకు కట్టుబాట్లను ఉల్లంఘించలేదు. అలా ఎవరైనా ఉల్లంఘిస్తే అప్పుడే వారి కుటుంబంలో ఏదో ఒకటి జరుగుతూ వస్తున్నది.

ఆచార వ్యవహారాలను పాటిస్తున్నాం

- వీరమ్మ, ఎగువమూలపల్లె, తూముకుంట



పల్లెల్లోని మహిళలందరం ఆనాటి నుంచి ఇప్పటి వరకు ఆచారాలు, సంప్రదాయాలను పాటిస్తున్నాం. అంటు, ముట్టు అయితే అయిదు రోజులు ఊరు బయట ఉంటాము. పెద్దగొడుగు స్వామికి 110 ఎకరాల సిగురువనము కలదు. ఆ వనంలోకి ఎవ్వరము (బహిష్టు) అంటూ అయిన వారము వెళ్లలేదు. చిగురువనంలోని చెట్లను ఎవరూ నరకం. ఆ కట్టెలను ఎవరు తీసుకురారు. ఆ వనాన్ని పవిత్రంగా భావిస్తాము.



పెద్దగొడుగుస్వామికి చెందిన చిగురువనము

రైల్వేకోడూరులో వర్షం

● వీధులు జలమయం ● నేలకూలిన వృక్షం

● రాకపోకలకు అంతరాయం

రైల్వేకోడూరు, నవంబరు 13: (ఆంధ్రజ్యోతి) మండలంలో బుధవారం ఒక మోస్తారు వర్షం కురిసింది. దీంతో రంగనాయకులపేట, కొత్తబజారు, రైల్వేస్టేషన్ రూటు, ధర్మాపురం, సూర్యానగర్, నరసరాంపేట తదితర వీధి రోడ్లు జలమయమయ్యాయి. పాదచారులు పలు ఇక్కట్లు పడ్డారు. మండలంలోని అనంతరాజుపేట ప్రధానదారికి పక్కనే ఉన్న పెద్దవృక్షం వర్షం దెబ్బకు నేలకూలింది. కూలిన వృక్షం ప్రధానదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరాజుపేట సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జున, గ్రామస్తులు కలసి అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని యంత్రాలతో కోయించి కొమ్మలను తొలగించారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.





సూర్యానగర్‌లోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు, (ఇన్‌సెట్లో) రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు

వృత్తే ఇంటిపేరుగా మారింది

● మైలాపురం నరసింహులు అలియాస్ పేపర్ నరసింహులు

● 50 ఏళ్లుగా నడుస్తూనే పేపర్ పంపిణీ

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేస్తున్న వృత్తే ఇంటి పేరుగా మారేంతగా ఆయన పనిలో జీవిస్తున్నారు. ఏదొక పని చేస్తూ జీవనం సాగించేది సాధారణమైనా పనే దైవంగా భావిస్తూ చేస్తున్న వృత్తికి న్యాయం చేయడం చూస్తే ఆయన ఆపనిని ఎంతలా ప్రేమిస్తున్నారో తెలుస్తోంది. పుట్టుకతో తల్లిదండ్రులు పెట్టిన పేరును సైతం మార్చి చేస్తున్న వృత్తి పేరునే ఇంటి పేరుగా పిలిపించుకుంటున్నారు. మైలాపురం నరసింహులు అంటూ పిలిస్తే పలుకరేమోకానీ పేపర్ నరసింహులు అంటూ పిలిస్తే నిద్రలో కూడా పలుకుతారు. సుమారు 50 ఏళ్లగా నడుచుకుంటూనే పేపర్ వేస్తూ తిరిగే ఈయన జీవిత చక్రంలోకి తొంగిచూస్తే...

స్థానిక అలమ్మవారిశాల వీధికి చెందిన 76 ఏళ్ల మైలాపురం నరసింహులు వైశ్యకుటుంబంలో 1948లో పుట్టారు. 1964లో ఓ దుకాణంలో గుమాస్తాగా పనికి చేరారు. 1969లో ఎం లక్ష్మీకుమారిని వివాహం చేసుకున్నారు. కుటుంబంలో మనిషి పెరిగే కొద్దీ ఖర్చులు పెరుగుతాయని భావించిన ఆయన దుకాణంలో పనిచేస్తూనే అదనపు ఆదాయం కోసం 1974 నుంచి హిందూ పేపర్‌ను ఇంటింటికీ వెళ్లి పంచడం మొదలెట్టారు. అప్పట్లో సైకిల్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఆ సైకిల్ కూడా నేర్చుకోలేదు, నడుచుకుంటూనే ఇంటింటికీ వెళ్లి పేపర్ వేసేవారు. ఆ తర్వాత ఉదయం పేపర్ కూడా కలిపి పంపిణీ చేసేవారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు హిందూ పేపర్ పంపిణీ చేస్తున్నారు. అప్పట్లో ఊరు చిన్న విస్తీర్ణంలోనే ఉండేది. చుట్టూ నాలుగైదు కిలోమీటర్ల వరకు తిరిగేవారు. ఇపుడు ఊరు బాగా పెరిగింది. సుమారు ఏడెనిమిది కిలోమీటర్లు తిరిగి ఇళ్లవద్దకు వెళ్లి పేపర్ వేయాల్సి వస్తోంది.



మైలాపురం నరసింహులు అలియాస్ పేపర్ నరసింహులు

పట్టణమంతా 13 పేపర్లు వేయాల్సి ఉంటుంది. అయితే ఇంటింటికీ వెళ్లి వేయాల్సి ఉన్నందున ఊరంతా నడుస్తూ వెళ్లాల్సిందే. పేపర్ వేయడం ద్వారా వచ్చే రోజు ఆదాయం రూ.26. కానీ ఇద్దరు పిల్లలకు పెళ్లి చేసి 76ఏళ్లు వచ్చినా ఆదాయం కోసం కాకుండా ఒకహాబీగా పేపర్ పంపిణీ చేయడం అలవాటుగా మారింది. ఏదొక పనితో జీవనం సాగించడం ప్రతి ఒక్కరూ చేస్తున్నా అసలు పేరును సైతం మరచిపోయేలా వారి జీవితం సాగింది. అంతగా ఆ పనిలో వారు తలమునకలై పోయారు. ఆ వృత్తి కుటుంబ పోషణకు ఉపయోగపడుతూ పనిని ఆస్వాదిస్తూ చేయడం ఆయన దైనందిన జీవితంలో ఒక్కటై పోయింది. ఓపిక ఉన్నంత వరకు ఇలా నడుస్తూనే పేపర్ వేయడం దైనందిన జీవితంలో అలవాటుగా మారిపోయిందని పేపర్ నరసంహులు చెబు తున్నాడు. ఇప్పుడిప్పుడే ఓపిక తగ్గుతోంది. ఓపిక ఉన్నంత వరకు చేస్తాను అని ఆనందంగా చెప్పారాయన.





ఇళ్లకు, షాపులకు పేపర్ పంపిణీ చేస్తున్న నరసింహులు

సామరస్యంగా ఎన్నికలు జరిగేలా చర్యలు

● జిల్లాలో 167 చెరువులకు సాగునీటి ఎన్నికలు

● ఎన్నికల శిక్షణ సమావేశంలో అధికారుల స్పష్టీకరణ

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి ఎన్నికలు సామరస్య వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఆర్డీవో రాఘవేంద్ర సూచించారు. స్థానిక మున్సిపల్ టౌన్ హాలులో బుధవారం మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమించిన ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 3276 చెరువులు ఉన్నాయన్నారు. ఇందులో వంద ఎకరాలు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణం (సాగు) గల 167 చెరువులకు సాగునీటి తీరువా ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు. తప్పనిసరైతే తప్ప ఎన్నికలకు వెళ్లకూడదని, సెలక్షన్ స్థాయిలోనే సరిపెట్టేలా చూడాలని సూచించారు. సాగునీటి సంఘాలకు ఈనెల 20న నోటిఫికేషన్ విడుదల చేసి, 23వ తేదీ ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారం, పది రోజులు రీషెడ్యూల్ చేసే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్ ఈఈ, మాస్టర్ ట్రైనర్ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో సర్పంచి, వార్డు సభ్యునికి పోటీ చేయడానికి ఉండే అర్హతతో పాటు సాగునీటి సంఘం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థికి అదనంగా కనీసం 1432 పసలీ వరకు సాగునీటి తీరువా చెల్లించి ఉండాలని స్పష్టం చేశారు. రాయచోటి ఆర్డీవో, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్నికల అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 167 చెరువుల కింద గల సాగునీటి ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలశాఖ, అంగన్‌వాడీ, తదితర విభాగాలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు. ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపై మదనపల్లె ఆర్డీవోతో పాటు ఇద్దరు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌లో తండ్రీ కొడుకులకు ఐదేళ్ల జైలు

● రూ.6 లక్షల జరిమానా విధించిన న్యాయమూర్తి

రేణిగుంట/మంగళం/రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన తండ్రీ కొడుకులకు ఎర్రచందనం కేసులప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధించారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్సు అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి బీటు కృష్ణాపురం సెక్షన్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం సిరివరం గ్రామానికి చెందిన తండ్రి తోట చిన్న చెంగయ్య, కుమారుడు చెంగయ్య పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరిద్దరిపై 2019, 2022 సంవత్సరాల్లో కేసులను నమోదు చేశామన్నారు. ఇంత కాలంగా కొనసాగుతున్న విచారణలో వీరిని దోషులుగా గుర్తించి ఆర్‌ఎస్‌ఎస్ ఏడీజే న్యాయస్థాన న్యాయమూర్తి నరసింహమూర్తి తండ్రీ కొడుకులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారన్నారు. శిక్ష పడిన వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. ఈ తీర్పు ఎర్రచందనం స్మగ్లర్లకు ఒక హెచ్చరికగా పనిచేస్తుందన్నారు.



తోట చిన్న గంగయ్య, చెంగయ్య

11 మంది ఐసీడీఎస్ ఉద్యోగులపై విచారణ

● పులివెందుల పూర్వ సీడీపీవో సావిత్రితో సహా

● 10 మంది సూపర్‌వైజర్లపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాజెక్టుకు గతంలో సీడీపీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన జి.సావిత్రితో సహా మరో 10 మంది సూపర్‌వైజర్లపై కూడా ఈ విచారణ కొనసాగనుంది. ఇందులో ఒక సూపర్‌వైజర్ మరణించడంతో ఆమెను మినహాయించాలని కూడా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రూ.8,71,862లు విలువైన బియ్యం, పప్పులు, ఆయిల్ వంటి ఎస్ఎన్‌పీ ఆహార పదార్థాలు దుర్వినియోగం జరిగినట్లు 2017లో గుర్తించారు. ఈ విషయాన్ని శాఖాపరమైన విచారణలో నిర్ధారణ కావడంతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనరు 2017 జూలై 24న ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి సంజాయిషీ నోటీసులిచ్చి విచారణ కొనసాగిస్తూ వచ్చారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ విచారణ ఐదేళ్లపాటు మరుగున పడింది. తాజాగా పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సమగ్రంగా విచారణ జరపడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా పనిచేసి రిటైర్డ్ అయిన జి.సావిత్రి, అదే విధంగా రిటైర్డ్ అయిన సూపర్‌వైజర్లు జె.ఎమిలియా, బి.రామానుజమ్మ, ఎం.రత్నకుమారితో పాటు ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతున్న సూపర్‌వైజర్లు కె.భారతి, వై.వి.రమణమ్మ, జి.లక్ష్మీదేవి, జె.వరలక్ష్మి, సరస్వతమ్మలపై పూర్తి విచారణకు ఆదేశించారు. వీరు కాకుండా మరణించిన మరో ఇద్దరు సూపర్‌వైజర్లు వెంకటసుబ్బమ్మ, సి.చెన్నమ్మలను విచారణ నుంచి మినహాయించాలని కూడా పేర్కొన్నారు. ఇందుకు కడప ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసరును విచారణాధికారిగా నియమించారు. విచారణాధికారికి అవసరమైన రికార్డులను సేకరించి అందుబాటులో వుంచేందుకు ప్రెజెంటింగ్ అధికారిగా పులివెందుల ప్రస్తుత సీడీపీవోను కూడా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మహిళ, శిశు, ప్రత్యేక ప్రతిభావంతులు, వయోజనుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మ కాపు..ఉఫ్

- అన్ సీజన్‌లో రుమాని మామిడి కాపు
- దెబ్బతీసిన మంగు.. డీలా పడ్డ రైతులు
- దిగుబడులు వచ్చినా కానరాని ధరలు
- టన్ను రూ.10వేలు పలుకుతున్న వైనం
- లోకల్ మార్కెట్‌లో విక్రయాలు

రైల్వేకోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ సీజన్‌లో రుమాని రకం మామిడి కాపునిచ్చింది. రైతన్నలు మంచి ధరలు పలుకుతాయని సంతోషపడ్డారు. అయితే వారి ఆశలను ఆవిరిచేస్తూ వర్షం రూపంలో దెబ్బతీసింది. తరచూ వర్షం కురవటంతో కాయలకు మంగు ఏర్పడింది. దీంతో మామిడి కాయలను జాతీయ మార్కెట్‌లో అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో రైతులు డీలా పడ్డారు. లోకల్ మార్కె ట్‌లో అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లం పేట, పెనగలూరు, ఓబుల వారిపల్లె మండ లాల్లో ఎండవేడిమికి ఈ సారి రుమాని ఉమ్మకాపు బాగా వచ్చింది. కాయలు కొన్నిచోట్ల మాత్ర మే మంగు లేకుండా దిగుబడులు వచ్చాయి. దీంతో కొందరు ముంద స్తుగానే పచ్చళ్లకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. డిల్లీ, ముంబాయ్ నగరాల్లో ఉన్న మార్కెట్‌లోకి కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మంగులేని మామిడి కాయలు రావడంతో రైల్వేకోడూరు కాయలకు డిమాండు తగ్గిపోయింది. దీంతో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, తిరుపతి, కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల మార్కెట్‌కు రైతులు తరలిస్తున్నారు. టన్ను రూ.10వేలు చెప్పున విక్రయాలు సాగుతున్నాయి.



రైల్వేకోడూరులో కాసిన రుమాని మామిడి కాయలు

రైల్వేకోడూరు నుంచి ఇతర రాష్ట్రాలకు 4 నుంచి 5 లోడ్ల వరకు కాయలు ఎగమతి చేశారు. మంగు రాకపోయి ఉంటే చాలా మంది రైతులు మంచి లాభాలు గడించేవారు. గత నెల నుంచి రుమాని మామిడి కాయలు కోతలు ప్రారంభమయ్యాయి. తమిళనాడులోని క్రిష్ణగిరి, దిండిగల్, కేరళలోని పాల్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో రైతులు కల్తార్ మందులు ఉపయోగించడంతో రుమాని, తోతాపూరి కాపునిచ్చింది. ప్రస్తుతం అన్ని రకాల మామిడి చెట్లకు ముందస్తుగానే పూతలు వస్తున్నా వర్షం దెబ్బకు మగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శెట్టిగుంట వద్ద పూత దశలో ఉన్న మామిడి చెట్టు

మంగు దెబ్బతీసింది



రుమాని మామిడి కాయలకు మంగు దెబ్బతీసింది. మార్కెట్‌లో ఎప్పటికి మామిడికి డిమాండ్ ఉంటుంది. అన్ సీజన్‌లో ఎక్కువగా నీలం, పునాసా, అల్లీపసందు మామిడి కాయలు మాత్ర మే వస్తున్నాయి. అయితే ఈ ఏడాది రుమాణి రకం అన్ సీజన్‌లో కాపు కాయడంతో సంతోషపడ్డాం. అయితే మంగు రావడంతో ఫలితం లేకుండా పోయింది.

-కస్తూరి రామచంద్రనాయుడు, రైతు, రైల్వేకోడూరు

వ్యాపారం బాగుంటుందని అనుకున్నాం



రుమాని మామిడి కాయలు కాపునిచ్చాయని.. వ్యాపారం బాగా ఉంటుందని అనుకున్నాం. అయితే కాయలకు మంగు రావడంతో వ్యాపారం లేకుండా పోయింది. కొందరి రైతుల తోటల్లోనే కాయలకు మంగు లేదు. వాటిని కొద్దిగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశాం.

-తిమ్మిశెట్టిపల్లి మణి, మామిడి వ్యాపారి

సాధారణంగా మామిడి డిసెంబరు మాసంలో పూతలు వచ్చి మార్చి నెలాఖరకు కాయలు మార్కెట్‌లోకి వస్తాయి. జూన్ ఆఖరి కల్లా మామిడి సీజన్ పూర్తి అవుతుంది. సీజన్ తర్వాత నీలం రకం మామిడి మాత్రమే ఉమ్మ కాపు వస్తుంది. సెప్టెంబరు నెలాఖరు వరకు ఉమ్మకాపు కాయలు మార్కెట్‌లో లభిస్తాయి. తర్వాత అల్లీపసందు మామిడి కూడా ఉమ్మకాపునిస్తుంది. ఇది ఎక్కువగా వినియోగ దారు లు ఊరగాయకు ఉపయోగిస్తారు. నీలం తర్వాత పునాసా మామిడి ఏడాదికి రెండు సార్లు కాపు నిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఈ నెలలో తొలిసారిగా రైల్వేకోడూరు ప్రాంతంలో రుమాణి ఉమ్మకాపు నిచ్చింది. గతంలో ఒక్కసారి తోతాపూరి కాయలు మాత్రమే ఉమ్మ కాపు నిచ్చాయి. వాతావరణ పరిస్థితుల్లో ఎక్కువగా మార్పులు రావడంతోనే ఇలా జరుగుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



గండిలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల పూజా కార్యక్రమాలు

చక్రాయపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రంలో పవితోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రెండో రోజు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బ య్య పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు ఉదయం వేద దివ్య ప్రబంధ పారాయణాలతో ప్రారంభించారు. ద్వార తోరణ పూజ, సోమకుంభ ప్రతిష్ట, మహా కుంభారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, మూలమత్ర వాహనం, స్నపన తిరుమనం, పవిత్రో ప్రతిష్ఠ, ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. సాయంత్రం చతుఃస్థానార్చన, వేద ప్రబంధ పారాయణాలు, త్రికాల ఆరాధన, సుందరకాండ పారాయణం, హోమం లుఘుపూర్ణాహుతి, నివేదన, శాత్తుముర్రై, గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కడప(వినాయకనగర్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రసన్నకుమారి, పల్లవి జాతీయస్థాయి అండర్-18 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ అరుణకుమారి తెలిపారు. డిసెంబరు 11 నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి గోవిందరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు సస్పెన్షన్



సుండుపల్లె జడ్పీ హైస్కూల్‌లో డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

సుండుపల్లె/రాయచోటి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన తెలుగు ఉపాధ్యాయుడు లోకేశ్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం బుధవారం రాత్రి ప్రకటించారు. 8వ తరగతి విద్యార్థి విఘ్నేష్‌ను ఉపాధ్యాయుడు కొట్టినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఆయన వివరించారు. అంతకుముందు రాయచోటి డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన సంఘటపై విచారణ నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యా యులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిని మందలించారు. మండల విద్యాశాఖ అధికారులు వెంక టేశ్ నాయక్, రవీంద్రనాయక్, హెడ్మాస్టర్ పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డ నాకింది అన్నట్లుంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు అని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు, రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నిత్యం విమర్శించేవన్నారు. ప్రస్తుతం చంద్రబాబు, మోదీ ప్రభుత్వాలు అంతకుమించి అప్పులు చేస్తున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 7 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం రూ.59వేల కోట్లు అప్పు చేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్స రంలో రూ.91,443 కోట్ల అప్పు చేస్తామని బడ్జెట్‌లోనే చూపించారన్నారు. 1947 నుంచి 2014 వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం 47లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందన్నారు. 2014 నుంచి 2024 వరకు మోదీ ప్రభుత్వం అదనంగా రూ.122 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీకి 15 మంది విప్‌లను ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతమంది విప్‌లు లేరని తులసిరెడ్డి అన్నారు.

చెరువు కట్టను పరిశీలించిన డ్వామా పీడీ



కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు వద్ద ఫిర్యాదు దారుడితో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పెద్దతిప్పసముద్రం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్టను బుధవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ మధుబాబు, ఉపాధి హామీ ఏపీవో తిరుపాలప్పతో కలిసి పరిశీలించారు. ఇటీవల కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్టపై గుట్టలో వెలసిన నరసింహస్వామి ఆలయం వద్దకు రోడ్డు వేయాలని కందుకూరుకు చెందిన రవిస్వామి అనే వ్యక్తి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలతో పాటు కలెక్టర్‌కు లేఖ రాయడంతో స్పందించిన అధికారులు బుధవారం కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్ట వద్దకు చేరుకుని ఫిర్యాదుదారుడితో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసి పనులను ప్రారంభించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఉపాధి సిబ్బందిని పీడీ ఆదేశించారు. చెరువులో నీరు అయిపోగానే ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడికతీత పనులను చేపట్టవచ్చని తెలిపారు ఆయన వెంట ఏపీడీ మధుబాబు, ఏపీవో తిరుపాలప్ప, ఉపాధి హామీ జేఈ మహేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, కదిరప్ప ఉన్నారు.

రూ.473 కోట్లతో హంద్రీ-నీవా కాలువ మరమ్మతు పనులు ప్రారంభం



బి.కొత్తకోట శివారులో హంద్రీ-నీవా కాలవ పనులు చేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు రూ.473 కోట్లతో పనులు చేపట్టారు. బి.కొత్తకోట-పీటీఎం మండలాల సరిహద్దులో రెండు రోజులుగా పనులు ప్రారంభమయ్యాయి. ఎక్స్‌కవేటర్లతో జంగిల్ క్లియరెన్స్, కాలువ గోడలకు మరమ్మతు పనులు చేస్తున్నారు. కాలువ విస్తరణ పనులు ప్రస్తుతానికి వాయిదా పడటంతో ఉన్న కాలువలోనే నీటిని కుప్పం వైపునకు తరలించేవిధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పీటీఎం నుంచి 132 కి.మీ మేర పనులు పూర్తి చేయనున్నారు. సత్యసాయి జిల్లా చెర్లోపల్లె రిజర్వాయరు నుంచి పీటీఎం, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు మీదుగా కుప్పంకు వచ్చే ఏడాది మే నెలకు నీటిని తరలించే లక్ష్యంతో పనులు చేపట్టినట్లు హంద్రీనీవా ఎస్ఈ రాజగోపాల్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలి

- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప మారుతీనగర్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా పాలక ప్రభు త్వాలు త్వరితగతిన ఆర్డినెన్స్ జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాటాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలకు రాజ్యాంగపరమైన ఎస్సీ రిజర్వే షన్‌లో సరైనరీతిగా న్యాయం జరగలేదన్నారు. ఈనెల 11 నుంచి జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశా లలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలపాలని కోరు తూ గతంలో రామచంద్ర కమిషన్ ఎస్సీ జాబితాలోని 59 ఉపకులాలను ఏబీసీడీగా వర్గీకరించి కులాల వారీగా రిజర్వేషన్‌ల పంపిణీ జరిగిందన్నారు. ప్రస్తుతం పాలక ప్రభుత్వాలు రిజర్వేషన్‌లను మూడు కేటగిరీలుగా ఏబీసీ చేయాలని జిల్లా యూనిట్‌గా తీసుకు న్నందుకు దళిత ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి తెలియపరచారన్నారు. ఏది ఏమైనా షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు అడ్డంకులు లేకుండా రాజ్యాంగంలోని 9వ షెడ్యూ ల్డ్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం ద్వారా శాశ్వత పరిష్కారం సులువు అవుతుందన్నారు. ఆదిశగా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా చూడాలన్నారు. కాగా, నిరసన కార్యక్రమానికి ముందు దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి.. అక్క డ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకు న్నారు. డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, సమితి రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు బాలలక్ష్మ య్య, కర్ణ, రమాదేవి, అంజనమ్మ, సుబ్బ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయండి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప ఎన్టీఆర్ సర్కిల్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ చాంబర్‌లో 71వ అఖిలభారత సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 14న సహకార మంత్రిత్వశాఖ కొత్త కార్యక్రమాల ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేసే కార్యకమాలు, 15న సహకార సంఘాలతో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన కార్యక్రమాలు, 16న వ్యవ స్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర కార్యక్రమాలు, 17న సహకార సంస్థలు వ్యాపార ప్రయోజత సంస్థలుగా రూపాంతరం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించు కార్యక్రమాలు, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కొరకు సహకార సంఘాలు కార్యక్రమాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో సహకర సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీవో జి.సుభాషిణి, డీసీఈ బ్యాంకు సీఈవోపీ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



ప్రొద్దుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ తాత్కాలిక కురగాయల మార్కెట్ వద్ద పెద్దమ్మగుడి పేరుతో మున్సిపల్ స్థలం ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంపై హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు కమిషనర్ మల్లికార్జున, ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్‌లు భారీ పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ స్థలంలో కట్టిన తాత్కాలిక షెడ్లు, బంకులు ఎక్స్‌వేటర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ స్థలం ఆక్రమించి కట్టిన పెద్దమ్మఆలయంతో పాటు ఇతర తాత్కాలిక కట్టడాలు, షెడ్లు , బంకులు తొలగించాలని గత కమిషనర్, ఏసీపీ నోటీసులు ఇచ్చారన్నారు. ఆ నోటీసులపై ఆక్రమణ చేసిన సుధాకర్ అనే వ్యక్తి హైకోర్టుకు వెళ్లాడన్నారు. హైకోర్టు కొంత సమయం ఇచ్చి విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అందులో బాగంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ స్థలం పూర్తి రికార్డులు పరిశీలించి అది మున్సిపాలిటీదిగా ధ్రువీకరించారన్నారు. అలాగే సదరు వ్యక్తి పెద్దమ్మ ఆలయం పేరుతో ఆలయం చుట్టూ వున్న స్థలంలో తాత్కాలిక షెడ్లు నిర్మించారు. వాటిని అద్దెలకు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఆమేరకు హైకోర్టుకు నివేదిక ఇచ్చామన్నారు. ఆతరువాత సదరు ఆక్రమణ దారునికి నోటీసులు ఇచ్చినా స్పందించని కారణంగా పోలీసు బందోబస్తు సహకారంతో తొలగించామన్నారు.

వివాదాస్పద వసతి గృహ కాంపౌండ్ తొలగింపు



కాంపౌండ్‌ను తొలగించిన దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నడింపల్లెలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం కాంపౌండ్ తొలగింపు వివాదాస్పదంగా మారింది. వసతి గృహంలో రెండు హాస్టళ్లతోపాటు ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయం ఉంది. హాస్టల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నడింపల్లె మున్సిపల్ హైస్కూలు విద్యార్థుల కోసం నాడు-నేడు పనుల ద్వారా మూడు తరగతి గదులు నిర్మించారు. ఆ తరగతి గదులకు హాస్టల్‌లో నుంచి వెళ్లడానికి తగిన ఏర్పాటు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కోరారు. వసతి గృహాన్ని పరిశీలించి కాంపౌండ్ వాల్ తొలగించి గేటు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అయితే సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల అనుమతి లేకుండానే కాంపౌండ్ వాల్‌ను తొలగించారు. గేటు ఏర్పాటు చేయడానికైతే కాంపౌండ్‌వాల్‌ను పూర్తిగా తొలగించాలి్సన అవసరం ఏముందని హాస్టల్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. కాంపౌండ్‌ను తొలగించడం వలన హాస్టల్ విద్యార్థులకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాలువ పూడిపోవడం వలన హాస్టల్‌లోని మురికినీరు అసలే నిలుస్తోందన్నారు. కాంపౌండ్ తొలగింపుపై హాస్టల్ అధికారులు ఏఎస్‌డబ్ల్యూవో, సాంఘిక సంక్షేమశాఖ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా కాంపౌండ్ తొలగింపుపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. కాంపౌండ్ తొలగింపుపై కలెక్టర్‌కు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళుతామని, తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ఓబులేసు, బాస్కర్, చెన్నమ్మ, ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు.

హోంగార్డు కుటుంబానికి అండగా ఉంటాం

హోంగార్డు భార్యకు చెక్కును అందజేసిన అదనపు ఎస్పీ



హోంగార్డు కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఏఎస్పీ

కడప(క్రైం)నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అండగా ఉంటామని అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు అన్నారు. మరణించిన హోంగార్డు ఆంజనేయులు నాయక్ కుటుంబానికి బుధవారం రూ.2.5 లక్షల చెక్కును అందజేసిన ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో హోంగార్డు మృతి చెందడం బాధకరమన్నారు. పోలీసు వితరణ నిధి నుంచి వారికి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. పోలీసు కుటుంబాలకు శాఖ ఎల్లాపుడూ అండదండలు ఉంటాయని సమస్యలుంటే ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దృష్టికి తెవాలన్నారు. కార్యాక్రమంలో పోలీస్ పరిపాలనాధికారి జ్యోతి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు దూలం సురేష్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని ముంపు, కంపు నుంచి కాపాడండి

పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్

కడప కలెక్టరేట్ నవంబరు13(ఆంధ్రజ్యోతి): చిన్న పాటి వర్షాలకు నగరం జలమయం అవుతోందని, కంపు, ముంపు బారి నుంచి ప్రజలను కాపాడాలని పీసీసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ కార్పొరేషన్ అధికారులను, అధికార, ప్రతిపక్ష పాలకులను డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నగరంలో 23 ప్రధాన కాల్వల నిర్మాణాలకు రూ.64 కోట్లు అంచనా వేశారన్నారు. కానీ ఇప్పటి వరకు నాలుగు పనులు మాత్రమే ప్రారంభించి ఆపనులు కూడా పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా నగర లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముంపు, కంపుబాధ తప్పడం లేదన్నారు. పారిశుధ్యంపై సమర్థవంతమైన చర్యలు చేపట్టడంలో మేయర్ విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యంగా ఎమెల్యే కడప ప్రజల పరిస్థితిని తెలుసుకుని నగరాన్ని ముంపు, కంపు నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంతుల్లా ఖాన్, కాంగ్రెస్ నేతలు కుళ్లాయప్ప, శ్యామలమ్మ, సంజయ్ కాంత్, రఫీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సవేరా వెంకటయ్య మృతి తీరని లోటు



కడప కల్చరల్, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): సవేరా.... సంగీత, సాహిత్య, నాటక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్వారి వెంకటయ్య మృతి నాటక రంగానికి తీరని లోటని జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ అన్నారు. దాదాపు 40 ఏళ్లగా నాటక రంగానికి ఆయన విశేష సేవలందిస్తూ ఎందరో కళాకారులను వెలుగులోకి తీసుకొచ్చి, ప్రోత్సహించి తద్వారా రాష్ట్రంలోనే సవేరా సంస్థకు గుర్తింపు, గౌరవం సాధించిపెట్టారన్నారు. చివరి క్షణం వరకూ నాటక రంగానికే జీవితాన్ని అంకితం చేసిన కళాసేవకుడన్నారు. కడపలో శ్రీమద్రామాయణ నాటక యజ్ఞం, విశ్వశాంతి యాగాల నిర్వహణ ద్వారా పలు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎక్కడ నాటక పోటీలు జరిగినా సవేరా సంస్థ వెండి నంది బహుమతులు గెలిచి తీరాల్సిందే అన్నారు. వెంకయ్య మృతిపట్ల జిల్లా పూర్వ కలెక్టర్, కళాబంధు డాక్టర్ కేవీ రమణాచారి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతితో నాటకరంగం ఒక గొప్ప నాటక సంస్థ నిర్వాహకుడిని కోల్పోయిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



శివపార్వతుల కల్యాణ దృశ్యం

సింహాద్రిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గురుకుంట క్షేత్రంలో బుధవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువలా నిర్వహించారు. దాతల సహకారంతో గురిజాల గ్రామస్తులు అన్ని వసతులతో కూడిన నూతన కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మండపం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వాహకులు శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని కన్నులారా చూసి తరించారు. నిర్వహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పెండింగ్ పనుల పూర్తికి సహకరించండి

కలెక్టర్‌కు మున్సిపల్ కౌన్సిలర్ల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనుల పూర్తి చేసేందుకు సహకరించాలని మున్సిపల్ కౌన్సిలర్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు విన్నవించారు. పులివెందులకు వచ్చిన కలెక్టర్‌ను కలిసిన వారు వినతిపత్రం అందించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్ తెలియజేస్తూ గతంలో పాడా ద్వారా అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, కొన్ని అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం పాడా రద్దు అయిందని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పనులు నిలిచిపోవడంతో యర్రగుడిపల్లె, బాకరాపురం, న్యాక్ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్పందించిన కలెక్టర్ పరిశీలిస్తామన్నారు.

సైంటిస్ట్‌ల కన్నా రైతు ఆలోచనే ఎక్కువ

పొలం పిలుస్తోందిలో కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



వి.కొత్తపల్లెలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

వీరపునాయునిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై అవగాహన కల్పిస్తే సైంటిస్టుల కన్నా రైతు ఆలోచనే మరింత పదునుగా ఉంటుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. బుధవారం పొలం పిలుస్తోందిలో వేరుశనగ, బత్తాయి, అరటి తదితర పంటలను పరిశీలించారు. వేరుశనగరకం, విత్తన మోతాదు పట కాలం, ధరల గురించి రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. పక్షిస్థావరాలు, జిగురు అట్టలు, పురుగుల నివారణ కషాయాలు వంటి పద్ధతులు అవలంబిస్తున్న రైతు తెలియజేశారు. గ్రామ రైతులు అరటి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్న మార్కెట్ సదుపాయాలు ఇంకా మెరుగుపడాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఎంపీపీ రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, జిల్లా సూక్ష్మ నీటి పారుదల శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ, కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీదేవి, మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు, మండల ఉద్యానవన శాఖ అధికారి రెడ్డయ్య, రైతులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులు వినియోగించుకోవాలి

వేముల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు అధునాతన వ్యవసాయ పద్ధతులను, టెక్నాలజీని వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. వి.కొత్తపల్లెలో పొలం పిలుస్తోంది లో కలెక్టర్ అరటి, పూల తోటలు పరిశీలించారు. రైతులు అవలంబించే అధునాతన వ్యవసాయ పద్ధతులు ద్వారా చామంతి, అరటి తోటలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పండించే పంటలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుడితో అధిక దిగుబడులు సాధించడానికి అధునాతన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ఉపయోగించుకోవాలన్నారు. రానున్న కాలంలో రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా, మార్కెటింగ్ ఉండేలా రైతు సేవ కేంద్రం పరిధిలో వ్యవసాయం చేసే రైతులం దరినీ గ్రూపుగా చేసి మార్కెటింగ్, మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోల్డ్‌స్టోరేజ్, ప్యాక్ హౌస్‌లను నిర్మిం చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయ అధి కారుల సూచనలు సలహాలు పొందాలన్నారు. అనంతరం డ్రోన్ ద్వారా పంటలకు పిచికారీ చేయ డం డెమో ద్వారా రైతులకు చూపించారు. వ్యవ సాయ జిల్లా అధికారి నాగేశ్వ రరావు, ఉద్యాన జిల్లా అధికారి సుభాషిణి, ఏపీఎంఐపీ పీడీ వెంక టేశ్వర్‌రెడ్డి, పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్‌రెడ్డి, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి తదితరరైతులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో 1న భగవద్గీత శ్లోకాల పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో డిసెంబరు ఒకటిన భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు శబరీష్, రామమోహన్, రాధాపాదప్రభు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ చిన్నారుల్లో ఆధ్యాత్మిక వికాసాన్ని పెంచడానికి 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు భగవద్గీత శ్లోక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 21వ తేదీలోపు తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8520027510 నంబరులో సంప్రదించాలని కోరారు.

రైతే విత్తనం తయారు చేసుకోవాలి

వీఏఏల సమావేశంలో ఏడీ శంకర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ శంకర్‌నాయక్

చెన్నూరు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): రైతులు పంట సాగుచేసేందుకు వాడే విత్తనాలను సొంతంగా తయారుచేసుకునే స్థాయికి తీసుకురావాలని వ్యవసాయ శాఖ ఏడీ శంకర్‌నాయక్ అన్నారు. చెన్నూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయ అధికారి శ్రీదేవి, వీఏఏలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటల సాగు విషయమై చర్చించారు. రైతులు ఇష్టానుసారంగా విత్తనాలు కొనుగోలు చేయడంతో కొన్ని చోట్ల నాణ్యమైన విత్తనం దొరక్కపోవడం పంట సాగులో కల్తీలు కనిపిస్తున్నాయన్నారు. అలాంటప్పుడు రైతే సొంతంగా విత్తనం తయారు చేసుకుంటే సాగు సమయంలో బయట షాపుల్లో విత్తనాన్ని ఎక్కువ ధరకు కొనాల్సిన అవసరం వుండదన్నారు. ప్రతి రైతుకూ పొలంలో విత్తనం వేసింది మొదలు మళ్లీ కోత దశలో విత్తనాలు ఇంటికి చేరేవరకూ అన్ని సమయాల్లో అవగాహన పెరగాలన్నారు. ముఖ్యంగా పురుగు మందుల వాడకాన్ని వీలైనంత ఎక్కువగా తగ్గించేలా చూసుకోవాలన్నారు. తద్వారా రైతుకు అదనపు ఖర్చు తగ్గుతుందన్నారు. పంట కోసిన తర్వాత మొదట నూర్పిడి సమయంలో వచ్చే విత్తనాలే సాగుకు బాగా పనికి వస్తాయన్నారు. అలాగే రబీ సీజన్‌లో పంట నమోదు తప్పక చేయాలని పంట సాగు చేసిన 15నుంచి 20 రోజుల వ్యవధిలో పంట నమోదుకు అవకాశం వుంటుందన్నారు. రబీలో ఆరుతడి పంటలకు డిశంబరు 15 వరకూ వరి సాగు నమోదు వుంటుందన్నారు. బీమా చెల్లించే రైతులు ఇప్పుడు వారే ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా చూడాలని పొలం పిలుస్తోంది రైతులకు ఎంతో మేలన్నారు. ప్రతి విషయాన్ని నిర్లక్ష్యం చేయవద్దని విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి రైతు శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అన్ని రైతు భరోసా కేంద్రాల వీఏఏలు పాల్గొన్నారు.

తులశమ్మకు పూజలు



బయనపల్లెలో తులసి పూజ

సికెదిన్నె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిలకద్వాదశిని పురస్కరించుకుని తులశమ్మ తల్లికి మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు తులశమ్మను ప్రత్యేకంగా అలంకరించి పేరంటాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. కార్తీకమాసం శుక్లపక్షం పూజలు నిర్వహిస్తే ఎంతో మంచి ఫలితాలు వస్తాయని మహిళలు భావించి పూజలు చేశారు. తులసి మొక్కను గౌరీదేవిగా, ఉసిరి మొక్కను మహా విష్ణువుగా భావించి గౌరీపూజ చేస్తుంటారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతం

సింహాద్రిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా 15వ తేదీన శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతం ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు మధుసూదన్‌రావు, ఆలయ కమిటీ చైర్మెన్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ఈ వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వహకులు కోరారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

'బోదకాలు'పై అప్రమత్తంగా ఉండాలి

లింగాల,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోదకాలు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పులివెందుల సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. చిన్నకుడాలలో మంగళవారం రాత్రి బోదకాలుపై సర్వే చేసి ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించారు. క్యూలెక్స్ దోమకాటు ద్వారా ఈవ్యాధి వ్యాపిస్తుందన్నారు. ప్రజలు దోమలువ్యాప్తి చెందకుండా పరసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతంచేయాలి

లింగాల,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జోన్‌లో పోటీలను విజయవంతం చేయాలని జోనల్ పోటీల కడప జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ అన్నారు. ఇప్పట్ల గురకుల పాఠశాలలో గురువారం నుంచి జరగనున్న పోటీలపై బుధవారం పీఈటీలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ బాలికలకు 14, 15 తేదీల్లో జూనియర్ ఇంటర్ బాలికలకు 16,17, 18 తేదీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, క్యారమ్స్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తారు.

జాతీయస్థాయి పోటీలకు కొత్తపల్లె విద్యార్థిని



బేస్‌బాల్ ఆడుతున్న అంజలి

వేముల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థిని అంజలి జాతీయస్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు నరసింహరావు తెలిపారు. ఈనెల 9,10,11 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. డిసెంబరు 2 నుంచి 7వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

18న మునీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

వీరపునాయునిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సర్వరాయసాగర్ పక్కన ఉన్న మునీశ్వర స్వామి ఆలయంలో 18వ తేదీన మూడో కార్తీక సోమవారం పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం దాతలచే భక్తులకు అన్నదానం చేపట్టనున్నారు.

విద్యుత్ వృథా అరికట్టాలి



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సికెదిన్నె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వృథా అరికట్టాలని విద్యుత్తు ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. చిన్నకాంపల్లి, తెలుగుగంగ కాలనీ, తదితర సబ్‌స్టేషన్లను బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పగటిపూట వీధిలైట్లు వెలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్తు వృథాను అరికడితే వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు అందించవచ్చన్నారు. లైన్‌లో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరిసేవ్యానాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామచంద్రారెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణం వేగవంతం చేయాలి

సికెదిన్నె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజారత్నం తెలిపారు. తాడిగొట్ల లేఔట్‌లో బుధవారం సిబ్బందితో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఏప్రిల్‌లోగా తమ గృహాలను పూర్తిచేసుకోవాలని లేని పక్షంలో బిల్లులు ఆగిపోయే అవకాశాలు ఉంటాయన్నారు. లబ్ధిదారులంతా త్వరితగతిన వాటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రతాప్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



తాడిగొట్లలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్ విజిలెన్స్ సీఐగా నరసింహా రెడ్డి



కడప(క్రైం)నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా విజిలెన్స్ సీఐగా నరసింహారెడ్డిని నియమిస్తూ ఆశాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ, సీఐగా ఉమ్మడి జిల్లాలోని పలు స్టేషన్‌లో విధులు నిర్వహించారు. వీఆర్‌లో ఉన్న అయన విద్యుత్ విజిలెన్స్‌కు బదిలీ అయ్యారు.

బాలికలను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కడప(క్రైం)నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఇటీవల తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన బాలికలను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కడపలో అదృశ్యమై తిరుపతిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని కడపకు పిలిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంట్లో పనులు చేయడం లేదని తల్లిదండ్రులు మందలించడంతోనే ఇళ్లు వదిలి వెళ్ళినట్లు తెలుస్తోంది. బాలికలకు, వారి తల్లిదండ్రులకు సీఐ వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ చేశారు.

రేపు కార్తీక పౌర్ణమి పూజలు

వీరపునాయునిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర ఆలయంలో 15న శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించనున్నారు. ఎస్. పాలగిరి క్రాస్ వద్ద ఉన్న అవధూత కాశిరెడ్డినాయన కార్తీక పౌర్ణమి వేడుకలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పెండ్లిమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికార మల్లేష్‌రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు, బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం, వ్యాసరచన, పద్యపఠనం పోటీలు నిర్వజహంచిగెలుపొందిన వారికి బహుమతులు ఇస్తారని ఒక ప్రకటనలో తెలిపారు.

సింహాద్రిపురంలో...

సింహాద్రిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కోవరంగుట్టపల్లి, సింహాద్రిపురం గ్రంథాలయ శాఖల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నేటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు గంగాదేవి, శేఖర్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పాఠకులకు పలు రకాల పోటీలు నిర్వహించి చివరి రోజు ముగింపు సమావేశం ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి



బుడ్డ శనగ పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి ఓబులేసు

పెండ్లిమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల సాగుచేసుకునే రైతులు బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. బుధవారం పెండ్లిమర్రి, పగడాలపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ఓబులేసు, రైతుశిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి నాగభూషణ్‌రెడ్డి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో విస్తరణాధికారి గంగాధర్‌రెడ్డి, గ్రామ ఉద్యానవన సహాయకురాలు వసంతకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబరు 15లోపు బీమా చెల్లించాలి

సికెదిన్నె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15లోపు రైతులు పంటల బీమా చెల్లించాలని ఏఓ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ రబీ సీజన్‌లో రైతులు వేసిన పంటలకు పంట నమోదు తప్పనిసరిగా చేసుకుని బీమాను చెల్లించాలన్నారు. వరి పంటకు మాత్రం డిసెంబరు 31 వరకు గడువు ఉంటుందని మిగతా పంటలకు డిసెంబరు 15 వరకే గడువు ఉంటుందన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుసిరెడ్డిపల్లె, పాపాసాహెబ్‌పేట గ్రామాల్లో రైతులకు పంటల బీమా రైతు వాటా చెల్లించాలన్నారు. పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

1న ఇస్కాన్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు శబరీష్, రామమోహన్, రాధా పాదప్రభు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారుల్లో ఆధ్యాత్మిక వికాసాన్ని పెంచడానికి 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు డిసెంబరు 1న భగవద్గీత శ్లోక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8520027510 నంబరులో సంప్రదించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి చోరీ

కొండాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.అనంతపురం గ్రామ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి వైరు, అందులోని ఇతర సామాన్లను ఎత్తుకెళ్లారు. ఐదుగురు రైతులకు చెందిన ఐదు 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు రైతులు ఫిర్యాదు చేసినట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ముద్దనూరు..: మండల పరిధి నల్లబల్లె గ్రామ సమీపంలోని పుల్లేరు వంక సమీపంలోని దోబీఘాట్ వద్ద నున్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ లోని కాపర్ వైర్ మంగళవారం చోరీ జరిగినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజవర్మ తెలిపారు.ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి వైర్ చోరీ చేసినట్లు ,ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

గంతలు తీసి గుంతలు పూడ్చండి

● నెలరోజులు అవుతున్నా పట్టించుకోని వైనం ● ప్రాణాంతకంగా మారుతున్న ఎన్‌హెచ్‌లో భారీ గుంతలు

ఎర్రగుంట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నెలరోజులు అవుతున్నా నిత్యం భారీగా రద్దీగా ఉండే నేషనల్ హైవేలో గుంతలు పూడ్చేందుకు అధికారులకు మనసొప్పడం లేదు. ఎర్రగుంట్ల కడపరోడ్డులోని జువారీ రైల్వేలైన్ వంతెన వద్ద, పోలీసుస్టేషన్‌కు ముందు భారీ గుంతలు పడ్డాయి. వీటి వల్ల ప్రాణాలకే ముప్పుందని వాహన చోదకులు, ప్రజలు మొత్తుకుంటున్నా ఎన్‌హెచ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. నెలరోజుల క్రితం పత్రికల్లో



నెలరోజులు అవుతున్నా ఎన్‌హెచ్ కడప రోడ్డులో పూడ్చని గుంత



పోలీసుస్టేషన్ వద్ద పడిన భారీ గుంత

పతాకశీర్షికన వచ్చింది. తూతూ మంత్రంగా వెట్‌మిక్స్ గుంతల్లో పడేసి వెళ్లిన అధికారులు ఇప్పటి వరకు వాటి వైపు కన్నెత్తైనా చూడలేదు. భారీ వాహనాలు వందల్లో వెళుతున్నాయి. దీంతో ఆ కంకర తొలగిపోయి గుంతలు మరింత పెద్దవిగా మారాయి. ఈ గుంతల వల్ల ద్విచక్రవాహన చోదకులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా రాత్రి పూట ఇప్పటికే ముగ్గురు ఈగుంతల్లో పడి ఆసుపత్రిపాలయ్యారు. వేగంగా వస్తున్న వాహనాలు దగ్గరకు రాగానే ఈ గుంతలు కనిపించడంతో వాటిని తప్పించేందుకు వెంటనే పక్కకు తిప్పుతున్నారు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టే ప్రమాదం లేకపోలేదు. ఇటీవలే రెండు,మూడు ప్రమాదాలు కూడా తప్పిపోయాయి. ఇది గమనించిన కొందరు కాషాయ జెండాను గుంతలోపెట్టి ప్రమాదాలను తప్పించే ప్రయత్నాలు చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా వెంటనే గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్ అసిస్టెంట్ ఇంజనీర్ విశ్వనాథ్‌ను వివరణ కోరగా రెండురోజుల్లో గుంతలు పూడుస్తామన్నారు.

గండికోట, రాజోలి బాధితులకు బడ్జెట్ కేటాయించాలి

● ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, పెద్దముడియం మండలంలోని రాజోలి బాధిత గ్రామాల రైతులకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం జమ్మలమడుగులోని విలేకరులతో ఆయన సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలోని కొండాపురం, గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైన 22 గ్రామాలకుగాను మొదటి విడత 14 గ్రామాల ప్రజలకు ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.6.75 లక్షలు చెల్లించారన్నారు. రెండో విడత ఎనిమిది ముంపు గ్రామాలకుగాను ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.10 లక్షలు చెల్లించడం జరిగిందన్నారు. మొదటి విడతలో 14 గ్రామాలకుగాను 9,700 మంది లబ్ధిదారులకు చెల్లించాల్సిన రూ.3.25 లక్షలు పెండింగ్ ఉందన్నారు. అలాగే రాజోలి ముంపు గ్రామాల రైతులకు నాలుగు వేల ఎకరాల వ్యవసాయ భూమికి ఎకరాకు రూ.12 లక్షల రూపాయలు పరిహారం చెల్లించేందుకు రెండు సంవత్సరాల కిందట అవార్డు పాస్ చేయడం జరిగిందన్నారు. కానీ రైతులకు ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు రాజోలి ముంపు గ్రామానికి రూ.12.50 లక్షలు అదనంగా పరిహారం పెంచి ఇవ్వాలని రైతులు కోరగా సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం రాగానే పరిహారం పెంచి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని రైతుల ఆయన తెలిపారు. రాజోలి రైతులను అదే దిశగా ఆదుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు.

రైతులతో సమావేశం

పోరుమామిళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ - మైదుకూరు 167వ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. బుధవారం ఆయన పోరుమామిళ్లలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న భవనంలో రైతులతో సమావేశం నిర్వహించారు. 40మంది రైతులు 43 ఎకరాలు భూములు కోల్పోతున్నారని, వీటికి ప్రభుత్వం బడ్జెట్‌ను కూడా కేటాయించిందని, భూములకు సంబంధించిన వివరాలను, డాక్యుమెంట్లను అధికారులకు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఐరన్‌ఓర్ లారీ బోల్తా



కొండాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.అనంతపురం గ్రామం సమీపంలో బుధవారం ఐరన్ ఓర్ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. కర్ణాటక రాష్ట్రం హోస్పేట నుంచి శ్రీకాళహస్తికి ఐరన్‌ఓర్ లోడుతో కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై వెళుతుండగా ప్రక్కనే ఉన్న గండికోట బ్యాక్‌వాటర్‌లో అదుపుతప్పి బోల్తాపడింది. అదృష్టవశాత్తు లారీలో ప్రయాణి స్తున్న డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

విద్యార్థినుల సమస్యలు పరిష్కరించండి

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు, కస్తూరిబాగాంధీ పాఠశాలలో సమస్యలు తిష్ఠవేశాయని, ఆర్డీవో సాయిశ్రీకి బుధవారం వినతి పత్రం అందించినట్లు హ్యూమన్‌రైట్స్ నియోజకవర్గ మహిళా చైర్‌పర్సన్ అన్నపురెడ్డి రాణెమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జమ్మలమడుగు గూడెం చెరువులోని కస్తూరిబా గాంధీ విద్యాలయ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇందుకు మంగళవారం జమ్మలమడుగు విద్య, పోలీసు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసినట్లు తెలిసింది. ఈ సమస్యలపై ఆర్డీవో విచారణ చేసి బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా తెప్పోత్సవం



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి తెప్పోత్సవాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం నిర్వహించారు. సాయంత్రం గంగా,గౌరీ సమేత ముక్తిరామలింగేశ్వరస్వామిని ఉత్సవ మూర్తులను అలంకరించి పెన్నానదిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రాజారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని ప్రొద్దుటూరు డివిజన్ మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలవీరారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎన్జీవో హోంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కడప సైనిక సంక్షేమ అధికారి రఘురామయ్య, సైనిక సంక్షేమ డైరెక్టర్ వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో సైనిక సంఘానికి కార్యాలయ నిర్మాణం, సైనిక సర్కిల్ నిర్మాణం, మాజీ సైనికులకు ఇళ్లస్థలాలు ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ సైనికులు, వీర నారీమణులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు.

ఇసుక ట్రాక్టర్ల తనిఖీ



ఇసుక ట్రాక్టర్లు తనిఖీ చేస్తున్న దృశ్యం


జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ముద్దనూరు రోడ్డులో రెండు రోజులు నుంచి ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటన చేయడం వెంటనే ఇసుకాసురులు వారికున్న పనులన్నీ పక్కనబెట్టి ఇసుక తరలిస్తున్నారని బహిరంగ ఆరోపణలున్నాయి. రోజుకు పొన్నతోట, గూడెం చెరువు, అంబవరం, హనుమంతగిరి, తదితర ప్రాంతాల నుంచి 500 ఇసుక ట్రాక్టర్లు రాత్రి, పగలు తరలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎర్రమట్టి గ్రావెల్ తరలిపోతోంది. రెవెన్యూ అధికారులు వారి సిబ్బంది ట్రాక్టర్లను తనిఖీ చేసి స్థానికంగా తీసుకెళుతున్నారా లేక బయటి ప్రాంతాలకు ఇసుక తరలించి డబ్బులు తీసుకుంటున్నారా అన్నదానిపై తనిఖీ చేసి పట్టుకుంటున్నారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా కొలవలి వేణుగోపాల్



బద్వేలుటౌన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయ నగర్‌కు చెందిన కొలవలి వేణుగోపాల్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన్ను స్టేట్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. రాష్ట్రంలో వెనుకబడిన నాయీబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.





రేపు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పోరుమామిళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) :గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై స్త్రీశక్తిభవనంలో ఆ నెల 15న ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మండలస్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు ఈ శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

అట్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని కమలకూరు, వలసపాలెం, నారాయణరాజుపేట, సూరాయిపల్లె, మన్యంవారిపల్లె, కాటంవారిపల్లె గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు మంచూరు సూర్యనారాయణరెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, ఉప్పతి రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ సభ్యత్వ నమోదు నిర్వహించి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ఉప యోగాలు వివరించారు. నేతలు ఎల్.రామక్రిష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, గురయ్య, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి,రాధాక్రిష్ణారెడ్డి, పెద్దరామ సుబ్బయ్య, చిన్న రామసుబ్బయ్య, పుల్లారెడ్డి, పరంధామరెడ్డి, చెంచురెడ్డి, గోపాల్‌రెడ్డి, మీనాక్షిరెడ్డి, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి అయ్యవారయ్య, నరసింహులు, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు విద్యార్థులు ఎంపిక

బద్వేలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాగ భూషణం కళాశాలలో బుధ వారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో పలువు రు విద్యార్థులు ఎంపికయ్యారు. జీ టెక్, జెన్ కీర్తి, జైనెక్స్ ఎడ్యు కేషన్ కంపెనీల వారు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు సుఫి యాన్, షాహిద్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలలో కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ మూడో సంవత్సరం విద్యార్థి మనోజ్ఞ, హరిత, వెంకటసాయి, సరస్వతి, జ్యోతి ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి రాచపూడి సాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ సత్యం, అధ్యాపకులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



ఎర్రగుంట్ల, నవంబరు 13 (ఆంధ్యజ్యోతి): మండలంలోని తిప్పలూరుకు చెందిన దాసరి శ్రీకాంత్(14) అనే విద్యార్థి నవంబరు 2వ తేదీనుంచి కనిపంచడంలేదని తల్లిదండ్రులు ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2న తిప్పలూరు నుంచి శ్రీకాంత్ కడప రిమ్స్ రోడ్డులో ఉన్న చైతన్య స్కూల్‌కు వెళుతున్నానని ఆర్టీసీ బస్సులో వెళ్లాడు. అయితే ఇప్పటి వరకు స్కూల్‌కు వెళ్లలేదు. ఇంటికీ రాలేదు. ఆచూకీ తెలిసిన వారు 9121100530 సెల్ నెంబరుకు సమాచారం ఇవ్వాలని అర్బన్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌బాబు తెలపారు.

ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి

బద్వేలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని పేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వీరశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఇళ్లులేని పేదల జాబితాను తయారు చేశారు. శీలం వారిపల్లెవార్డు సచివాలయ పరిధిలోని సమాచారం సేకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.సీపీఐ నేతలుబాలు, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు అవార్డులు

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో బుధ వారం కూచిపూడి కళానిలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. తమిళనాడు అరుణాచలం దేవాలయంలో ప్రదర్శన ఇచ్చిన వారికి నంద్యాలవారి ఆధ్వర్యంలో పల్లంశెట్టి సురేష్ అరుణాచలం, దొమ్మరనంద్యాల విద్యార్థినులకు అవార్డులు అందించినట్లు వారు తెలిపారు. విద్యార్థినులు ధన్య, అద్విత, కారుణ్య, కిరణి, చరితకు అవార్డులు ప్రదానం చేశారు.

సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మైథిలీరెడ్డి

కాశినాయన నవంబరు (ఆంధ్రజ్యోతి)13:ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషిచేయాలని ఎంపీపీ నల్లేరు పోలమ్మ,ఎంపీడీవో మైథిలీ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం నర్సాపురం వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి పాటుపడాల న్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సభలో నివేదికలు చదివి వినిపించారు. కాగా మైనర్ ఇరిగేషన్,సాంఘిక సంక్షేమ,రోడ్లు భవనాలు, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులు సమావేశానికి గైర్హా జరవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షు డు బి.భాస్కర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రయత్నించండి

కాశినాయన నవంబరు(ఆంధ్రజ్యోతి)13:విద్యార్థులు పట్టుదలతో ప్రయత్నిస్తే అనుకున్నది సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్ట్ సావిశెట్టిపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూలా రామక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపురం ఏపీ మోడల్ పాఠశాలలో 8,9,10, ఇంటర్ విద్యార్థులకు ఎంఈవో నిర్మల అధ్యక్షతన నైతిక విలువలు,క్రమశిక్షణ ,కార్యదక్షత లక్ష్యసాధనపై ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపా ల్ సౌజన్య,ఎస్టీయూ సీపీఎస్ కమిటీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, ఎస్టీయూ నాయకులు రమణ,ఈశ్వర్‌రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతో సంస్కారం నేర్చుకోవాలి

చాపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో మంచి సంస్కారం నేర్చుకోవాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ అన్నారు. లక్ష్మిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు రమాకుమారి వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, హెడ్మాస్టర్ సూర్యనారాయణ, రిటైర్డు ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో పాల్గొనాలి

ఖాజీపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసంగా ఉంటారని ఎంఈవో నాగస్వర్ణలత అన్నారు. బుధవారం ఖాజీపేట మోడల్‌స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ విజయనరసింహ, చిన్నఅమ్ములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఏపీ104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్‌అలీ, ప్రధాన కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 104 వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.



చిరుజల్లులతో రైతుల్లో టెన్షన్

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు టెన్షన్ ఏర్పడింది. రెండు రోజుల క్రితం అల్పపీడనం వల్ల వర్షాలు కురుస్తాయని సమాచారం రావడంతో రైతులు ఆరుగాలం కష్టించి పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయంలో వరి సాగు చేసిన రైతులు టెన్షన్‌కు గురయ్యారు. అల్పపీడనం మబ్బులు, మోడాలతో వరి పొలంలో రైతులు ధాన్యాన్ని మిషన్‌తో కోత జోరుగా పనులు జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల కోత పెట్టిన వరి ధాన్యాన్ని ఆరబెట్టడానికి నానా తంటాలు పడ్డారు. మంగళవారం, బుధవారం అప్పుడప్పుడు ఉదయం చిరుజల్లులు కురవడంతో రైతులు మరింత టెన్షన్‌కు గురయ్యారు.





ప్రభుత్వభూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు



ప్రభుత్వస్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె రెవెన్యూపరిధిలోని సర్వేనెంబర్ 812 లో ప్రభుత్వభూమిని ఆక్రమించి గుడిసెలువేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూమిలో 100 మంది ఎస్టీలు బుధవారం గుడిసెలువేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంటనే పోలీసు సిబ్బందితో ఆక్రమిత ప్రాంతానికి వెళ్లి అక్కడ వేసుకున్న గుడిసెలను తొలగించారు. అర్హులైన పేదలు, ఇల్లులేనివారు ఎవరైనా ఉంటే ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను తీసుకువస్తే ప్రభుత్వస్కీం వచ్చినప్పుడు స్థలాలను కేటాయిస్తామని ఆయన అన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి పందుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మాకు ఇంటికోసం ఇక్కడ గుడిసెలు వేసుకున్నామని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని నెలల ముందునుంచే గూడుకల్పించాలనిఅర్జీలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో మేము ఇక్కడ గుడిసెలు వేసుకుంటున్నామని ఆక్రమణదారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా 2001 నుంచి ఈ భూమి మా ఆధీనంలో ఉందని, అప్పటి రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారని ఇండ్ల రాజేశ్వరమ్మ తెలిపారు. మా భూమి అయినప్పటికీ టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు వారిచే గుడిసెలు వేయించే ప్రయత్నం చేస్తున్నారని రాజేశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ ఇదంతా ప్రభుత్వం ఆధీనంలోనే ఉందని, 812 సర్వేనంబర్ అంతా ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని అక్కడ హెచ్చరికబోర్డును ఏర్పాటు చేశారు.